క్లుప్తంగా

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ఏఓ కె.దేవదాసు

నకరికల్లు: మండలంలోని మిచాంగ్ తుపాను బాధిత రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం, కుంకలగుంట, చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, చేజర్ల, రూపెనగుంట్ల గ్రామాల్లోని పంటనష్టపోయిన రైతులకు 80శాతం రాయితీపై శనగ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటనష్టం వాటిల్లిన రైతులను గుర్తించడంలో ప్రభుత్వ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించారన్నారు. 33శాతంపైగా నష్టం కలిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ మండలంలో రైతులకు పంపిణీ చేసేందుకు 750 క్వింటాళ్ల శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జేజీ–11 రకం శనగ విత్తనాలు 80శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శనగలు కేజీ పూర్తి ధర రూ.81 కాగా 80శాతం రాయితీపై కేవలం రూ.16.20కే ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేచవరం ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.రవిబాబు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పల్లెల్లో సమగ్ర సంక్షేమాభివృద్ధి

- లంకెలకూరపాడులో గడప గడపకు మన ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లలో రూ.16కోట్లపైన నిధులు



లంకెలకూరపాడులో గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ సాయం, గ్రామాల్లో సమగ్రాభివృద్ధిని అందించిన ఘనత యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజు బుధవారం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ, సమస్యలను అడిగి అప్పటికప్పుడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు, అందరూ ఆరోగ్యంగా ఉండాలని భావిస్తూ ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మంచి జరిగిందనుకుంటేనే నాకు ఓటు వేయండన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రానున్న రోజుల్లో జరిగే ఎన్నికల్లో మీరంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, నన్ను ఆశీర్వదించి అండగా ఉండాలని కోరారు.

నాలుగున్నరేళ్లలో రూ.16కోట్లపైన అభివృద్ధి..

లంకెలకూరపాడు గ్రామంలో నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.12,05,53,952, నాన్ డీబీటీ ద్వారా రూ.2,37,88,907, గ్రామంలో రూ.1కోటి 67 లక్షల మేర అభివృద్ధి పనులకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మోర్తల వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ మలిరెడ్డి అనూష, మార్కెట్‌యార్డు చైర్మన్ పెండెం బాబురావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజీఎం రామలింగారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిక్కురు రామిరెడ్డి, ప్రభాకరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం .. ప్రాణాలను నిలబెడదాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నేడు ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రక్తదానం చేసే గదిలో బెడ్స్

సత్తెనపల్లి: రక్తదానం చేద్దాం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెబుదామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరంపై బుధవారం ఆయన మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చునన్నారు. అందుకే దీన్ని మహాదానం అంటారని, రక్తదానం చేసే వాళ్లని ప్రాణదాతలు అంటారన్నారు. అయితే దురదృష్టవశాత్తు రక్తదానంపై ఇంకా అపోహలు ఉన్నాయని, వాస్తవానికి రక్తదానం చేయడం వల్ల ఒకరి జీవితాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. అంతేకాకుండా రక్తదానం చేసిన వ్యక్తి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారన్నారు. అందువల్ల ప్రజలు అపోహలు వీడాలని, రక్తదానం.. ఇది ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ప్రతి మనిషికి ఏదో ఒక సందర్భంలో రక్తం ఎక్కించాల్సి వస్తుందని, ఒక్కోసారి కావాల్సిన రక్తం అందుబాటులో ఉండక ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఏటా సీఎం జగన్ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పిస్తూ మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెగా రక్తదానం శిబిరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో పాటు ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానంలో భాగస్వాములు కావాలని కోరారు.

నేడు అన్ని గ్రామాల్లో ఘనంగా సీఎం జగన్ జన్మదినోత్సవం

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంలోని 108 గ్రామాల్లో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు, సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలకు, పార్టీ శ్రేణులకు బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం నాలుగేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గ రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. తనపై నమ్మకముంచి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలపాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం అభిమానుల సమక్షంలో అడ్వాన్స్ శుభాకాంక్షల కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, పాశం శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం క్రోసూరులో ఉదయం 11గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. తదుపరి క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లోని ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. కావున ప్రజలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల దేశభక్తి భావితరాలకు ఆదర్శం

నకరికల్లు: భరతమాత విముక్తి కోసం చిన్నవయస్సులోనే ధైర్యంగా ఉరికంబం ఎక్కిన అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల పోరాటపటిమ నేటితరానికి ఆదర్శనీయమని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల వర్ధంతి సభను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత్‌ బచావో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు వి.కోటానాయక్ మాట్లాడుతూ అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల మతాలు వేరైన స్వాతంత్య్ర పోరాటంలో కులమతాలకు అతీతంగా సాగిన వారి స్నేహం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, భారత్ బచావో జిల్లా కార్యదర్శి షేక్ సర్దార్, పలుసంఘాల నాయకులు జయకృష్ణ, గోదా బాల, గాదెకుమారి, మౌలానా అబ్దుల్ ఖాదిర్, వినుకొండ సుభాని, లాలూ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులనూ ఆదుకోండి



అమరావతి: ఇటీవల మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ఆదుకోవాలని బుధవారం మండల కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో అమరావతి, మునుగోడు, నరుకుళ్ళపాడు గ్రామ సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో వాగుల పరివాహక గ్రామాల పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. శనగ, కంది, మినుము, పత్తి, మిర్చి సాగు చేసిన రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన కౌలు రైతుల పేర్లు నమోదు చేసి, ఈ క్రాపులో నమోదు కాని పంటలకు కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఖరీఫ్, రబీలో వేసిన అన్ని పంటలకు బీమా పరిహారాన్ని రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ మొహిద్దీన్‌వలి, ఎస్‌కే రఫీ, బెల్లేపల్లి పోలు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన సన్నివేశం

కారెంపూడి: క్లాస్ మేట్స్ పోలీస్ అధికారులుగా ఉద్యోగం సాధించి శిక్షణలో కూడా బ్యాచ్ మేట్స్ అయి వారంతా ఒకే చోట పల్నాడు ప్రాంతంలోనే ఉద్యోగాలు చేస్తున్న అరుదైన సన్నివేశం ఇది. ఇటీవల కారెంపూడిలో జరిగిన పల్నాటి ఉత్సవాలలో ఉద్రిక్తతలు చెలరేగినా వాటిని అదుపు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు వీరంతా కృషి చేశారు. గురజాల సీఐ టి.బాలకృష్ణ, మాచర్ల టౌన్ సీఐ పి.శరత్‌బాబు, కారెంపూడి సీఐ దార్ల జయకుమార్, గురజాల ఎస్‌ఐ టి.అశోక్‌బాబు అందరూ కూడా మిత్రులు. పైగా ఒకే చోట పల్నాడులోనే ప్రస్తుతం ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. సీఐ శరత్‌బాబు, సీఐ జయకుమార్ క్లాస్ మేట్స్. పైగా ఈ అధికారులు నలుగురు కూడా ట్రైనింగ్‌లో బ్యాచ్ మేట్స్. ట్రైనింగ్‌లో నలుగురు ఎస్‌ఐలుగా శిక్షణ పొందారు. అందరూ కూడా సమస్యాత్మక పల్నాడులో శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజాసేవలో ఉన్నారు.

జీవితాల్లో వెలుగులు పంచడమే క్రిస్మస్

- ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టణంలోని షాలోం చర్చిలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు



మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న కోడిరెక్క దేవదాస్

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు పంచడమే నిజమైన క్రిస్మస్ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని నాగార్జుననగర్ కాలనీలో గల షాలోమ్ చర్చిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క దేవదాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేడుకలకు వైఎస్సార్ సీపీ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సలగాల మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ మానవాళి రక్షణకే క్రీస్తు జన్మించారన్నారు. క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమన్నారు. ప్రపంచమంతా నిర్వహించుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని కొనియాడారు. క్రీస్తు బోధనలు అనుసరించి ఆయన మార్గంలో నడవాలన్నారు. బైబిల్‌లో ఒక వాక్యం నన్ను అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు మార్గం జీవన విధానం అన్నారు. ఆ విధానంలో నడిస్తే ప్రపంచం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్నారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు కేక్ కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ సుధీర్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మంత్రి అంబటి రాంబాబును పూలమాల, దుశ్శాలువాతో కోడిరెక్క దేవదాస్ సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, సీనియర్ న్యాయవాది బగ్గీ నరసింహారావు, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.బి.ఆర్.జె. ప్రసాద్, నాయకులు కాటుమాల డేవిడ్, జూపల్లి పాల్, తదితరులున్నారు.

ప్రేమ..శాంతి.. సమాధానం క్రిస్మస్ సందేశం



పట్నంమాలపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రేమ, శాంతి, సమాధానం.. ఇదే క్రిస్మస్ సందేశం అని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక పట్నంమాలపల్లి ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉండాలని క్రీస్తు సందేశమిచ్చారన్నారు. క్రీస్తు చూపించిన మార్గంలో నడిస్తే ప్రపంచం ప్రేమమయంగా మారుతుందన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ మేలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, గ్రామ ఉపసర్పంచి నిమ్మా విజయసాగరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు



అనంతవరంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస అర్చనలు

అనంతవరం(క్రోసూరు) : మండలంలోని అనంతవరం గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతినిత్యం స్వామివారికి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పోతురాజు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఐదు గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం గోత్రనామ కార్యక్రమాలు, గోదా అష్టోత్తరం శ్రీదేవి భూదేవిలకు కుంకుమార్చనలు జరుపబడతాయన్నారు. ప్రతి శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి గరుడసేవ, అలాగే ప్రతినిత్యం సాయంత్రం గణపతి హోమం, వాస్తు, సుదర్శన, మృత్యుంజయ, నవగ్రహ హోమం జరుగుతాయన్నారు. ప్రతినిత్యం కూడా స్వామివారికి ప్రణవ హారతి, శంఖు చక్ర హారతి, కుంభ, నక్షత్ర హారతి ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనంలో భాగంగా శయన అలంకారితులైనస్వామి దర్శనం, దక్షిణావృత శంకు తీర్థం భక్తులకు అందించబడుతుంది. దేవాలయ ప్రాంగణం మొత్తం కూడా రంగురంగుల పుష్పాలతో అలంకరణ అలాగే 108 కలశాలతో అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

ఆశాజనకంగా కందుల ధర

కారెంపూడి: ఈసారి ప్రభుత్వమే మద్దతు ధరకు కందులు కొనే ఆలోచన చేస్తోందని త్వరలో దానిపై వ్యవసాయశాఖ అధికారులకు సమావేశం కూడా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.యలమందారెడ్డి బుధవారం తెలిపారు. కారెంపూడి మండలంలోని మూడు వేల ఎకరాలలో కంది పంట సాగులో ఉందని పంట కూడా చాలా ఆశాజనకంగా ఉందని ఏవో తెలిపారు. ఇటీవల తుపాను వర్షాలు వర్షాధారంగా వేసిన కంది పంటకు బాగా మేలు చేశాయన్నారు. ఈ సారి కంది ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉందన్నారు. దానికి తగినట్లుగా ధర కూడా బాగుందని, క్వింటా కందుల ధర బహిరంగ మార్కెట్లో రూ.11 వేల దాకా ఉందన్నారు. ప్రభుత్వం కూడా మిగతా పంటలతో పాటు కందులను కూడా మద్దతు ధరకు కొనే ఆలోచన చేస్తోందని తెలిపారు.

షాదీఖానా నిర్మాణ పనులు పరిశీలన



దొడ్లేరులో షాదీఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మిస్తున్న షాదీఖానా పనులను బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మేజరు పంచాయతీల్లో ముస్లిం మైనార్టీల కొరకు షాదీఖానాలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గ్రామంలోని ముస్లిం మైనార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ..

క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సహృదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు చీరలు పంపిణీ చేశారు.